

**సోమశిలలో 68.535 టీఎంసీలు**

సోమశిల: జలాశయంలో శుక్రవారం 68.535 టీఎంసీలు ఉన్నాయి. ఎగువ నుంచి 5,900 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, డెల్టాకు 2,150, ఉత్తరకాలువకు 700, కండలేరుకు 10 వేలు, దక్షిణ కాలువకు 400 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



**బంగారం ధరలు**

| | |
|---|---|
| 24 క్యారెట్లు (10 గ్రా) | రూ.79,720 |
| 22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా) | రూ.7,268 |
| 3 శాతం జీఎస్టీతో | రూ.7,486 |
| నవర (8 గ్రా) | రూ.59,888 |

**వాతావరణం**

గరిష్టం/కనిష్టం 32.6 /25.5

జిల్లాలో శనివారం ఆకాశం మేఘావృతంగా ఉండి, అక్కడక్కడ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది. శుక్రవారం గాలిలో తేమ 74 శాతంగా ఉంది.

## న్యూస్‌రీల్

### వీఎస్‌యూలో పీహెచ్‌డీ ప్రవేశాలకు దరఖాస్తు

వెంకటాచలం: విక్రమసింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ)లో పీహెచ్‌డీ ప్రవేశాలకు దరఖాస్తులు డిసెంబరు 15వ తేదీలోగా సమర్పించాలని వీఎస్‌యూ ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీహెచ్‌డీ ప్రవేశాలకు యూజీసీ నెట్ పీహెచ్‌డీ కోటా, ఎక్స్‌ట్రా మ్యూరల్, ఎగ్జిక్యూటివ్ కోటా సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలియజేశారు. సీట్ల వివరాలు, అర్హతలు, నిబంధనల కోసం విశ్వవిద్యాలయ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ కార్యాలయంలో కానీ, www.vsu.ac.in వెబ్‌సైట్‌లో సంప్రదించాలని సూచించారు.

### రేపటి డీఎస్సీ స్క్రీనింగ్ టెస్ట్ వాయిదా

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): డీఎస్సీలో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఉచిత రెసిడెన్షియల్ విధానంలో శిక్షణ ఇచ్చేందుకు సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో ఈ నెల 10న నిర్వహించాల్సిన స్క్రీనింగ్ టెస్ట్‌ను వాయిదా వేస్తున్నామని జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారత అధికారి బి.శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కృష్ణా, గుంటూరు, ఉభయ గోదావరి జిల్లాల్లో ఎంఎల్‌సీ ఎన్నికల నేపథ్యంలో కోడ్ అమల్లో ఉన్నందున స్క్రీనింగ్ పరీక్షను వాయి దా వేశామన్నారు. పరీక్ష జరిపే తేదీని మళ్లీ తెలియజేస్తామని తెలిపారు.

### ఉచితంగానే స్మార్ట్ మీటర్లు

- జిల్లాలో ఇప్పటికే 8 వేలు ఏర్పాటు



మాట్లాడుతున్న ఎస్ఈ విజయన్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లాలో ఏర్పాటు చేస్తున్న స్మార్ట్ విద్యుత్ మీటర్లకు వినియోగదారులు ఎలాంటి రుసుం చెల్లించనవసరం లేదని, పూర్తిగా ఉచితంగా విద్యుత్‌శాఖ వారే ఏర్పాటు చేస్తున్నట్లు ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్ స్పష్టం చేశారు. నగరంలోని విద్యుత్‌భవన్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికే 8 వేల స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేశామన్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపై వినియోగదారులు ఎలాంటి సందేహాలు పెట్టుకోవద్దని, వీటితో చాలా ఉపయోగకరమన్నారు. కచ్చితమైన విద్యుత్ యూనిట్ల రీడింగ్, బిల్లింగ్ స్మార్ట్ మీటర్లతోనే సాధ్య పడుతుందన్నారు. జిల్లాలోని అన్ని డివిజన్లలో ఈ మీటర్ల ఏర్పాటు ప్రక్రియ సాగుతోందన్నారు. మొదట ప్రభుత్వ కార్యాలయాల్లో 5 వేల సర్వీసులకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేశామని, రోజుకు 300 మీటర్ల చొప్పున ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతి నెల 200 విద్యుత్ యూనిట్లు దాటిన విద్యుత్ సర్వీసులకు స్మార్ట్ విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ స్మార్ట్ విద్యుత్ మీటర్ ద్వారా ప్రతి నెలాఖరు రోజు అర్ధరాత్రి 12 గంటలకు ఎంత రీడింగ్ ఉంటుందో ఆ రీడింగ్ పైనే విద్యుత్ బిల్లింగ్ ఉంటుందని, కచ్చితమైన రీడింగ్ వచ్చే అవకాశం ఉంటుందన్నారు. ఈ స్మార్ట్ విద్యుత్ మీటర్ల ఏర్పాటుకు విద్యుత్ సిబ్బందికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

### వివాదాస్పద భూముల్లో బోర్డులు ఏర్పాటు చేయండి

- కందుకూరు సబ్‌కలెక్టర్ శ్రీపూజ



అధికారులతో సమీక్షిస్తున్న సబ్ కలెక్టర్ శ్రీ పూజ

వరికుంటపాడు: మండలంలో ప్రభుత్వ భూములు, స్థలాలు ఆక్రమణకు గురికాకుండా ముందస్తుగా బోర్డులు ఏర్పాటు చేయాలని కందుకూరు సబ్‌కలెక్టర్ శ్రీపూజ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఆమె శుక్రవారం వరికుంటపాడు మండలంలోని తూర్పురొంపిదొడ్లలో సబ్‌కలెక్టర్ కోర్టులో పెండింగ్‌లో ఉన్న భూ సమస్యకు సంబంధించిన భూమిని క్షేత్ర స్థాయిలో పరిశీలించి విచారణ చేపట్టారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఏ రకమైన ప్రభుత్వ భూమి కూడా అన్యాక్రాంతం కాకుండా చూడాలని తహసీల్దార్ హేమంత్‌కుమార్‌ను ఆదేశించారు. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన బాధ్యత రెవెన్యూ సిబ్బందిపై ఉందన్నారు. సిబ్బంది అధికారులు మండల ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలన్నారు. రెవెన్యూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో ఆర్ఐ యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

# పేదల బియ్యం పెద్దల భోజ్యం

- కందుకూరులో పక్కదారి పడుతున్న రేషన్ బియ్యం
- స్టాక్ పాయింట్ నుంచే నేరుగా నల్లబజారుకు తరలింపు
- ఓ బడా నేతకు వ్యాపారంలో 30 శాతం కమీషన్
- అక్రమ వ్యాపారంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీదే కీలకపాత్ర
- టీడీపీ నేతల కబంధహస్తాల్లో రేషన్ షాపులు
- డీలర్లు నెలకు రూ.లక్ష నుంచి రూ.1.50 లక్షల సంపాదన
- రూ.2 కోట్ల మేర రేషన్ మాఫియా దోపిడీ
- సివిల్ సప్లయ్స్ కార్పొరేషన్ డైరెక్టర్ తనిఖీల్లో దొరికిన దొంగలు

**పేదలకు ప్రభుత్వం సబ్సిడీపై సరఫరా చేసే బియ్యం పెద్దల బొక్కసాల్లోకి వెళ్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కందుకూరు నియోజకవర్గంలోని రేషన్ షాపులన్నింటిని టీడీపీ నేతలు లాగేసుకున్నారు. ఆ షాపులకు సరఫరా అయ్యే బియ్యంలో తొంభై శాతం నల్లబజారుకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి నేరుగా రైస్‌మిల్లులకు చేరుతున్నాయి. అక్కడ పాలిష్ పట్టించి కృష్ణపట్నం పోర్టు ద్వారా విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. పెద్ద మొత్తంలో కమీషన్ పొందుతున్న ఓ బడా నేత అండతో సివిల్ సప్లయీస్, పోలీసుల సహకారంతో ఈ వ్యాపారం జరుగుతోందని సమాచారం. ఇటీవల సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ డైరెక్టర్ రేషన్ షాపులను తనిఖీ చేయడంతో ఈ విషయం వెలుగు చూసింది. అయితే ఆయన నోరు నొక్కేసేందుకు పైస్థాయి నుంచి ఒత్తిళ్లు తెస్తున్నట్లు సమాచారం.**




సాక్షి ప్రతినిధి, నెల్లూరు: కందుకూరు నియోజకవర్గంలో టీడీపీ నేతల దోపిడీకి కాదేది అనర్హం అన్నట్లుగా మారింది. ప్రభుత్వం మారిన రోజు నుంచి మట్టి, ఇసుక, గ్రావెల్ దోపిడీకి తెరతీసిన టీడీపీ నేతలు, ప్రభుత్వ అధీనంలో ఉండే మద్యం షాపులను బలవంతంగా సొంతం చేసుకున్నారు. చిరు ఉద్యోగులు పాత వారిని తొలగించి తమకు అనుకూలమైన వారిని నియమించుకునే వరకు అక్రమాలకు తెరలేపారు. ఇక కాంట్రాక్టర్లు, ఇతర వ్యాపారులకు టార్గెట్లు పెట్టి దండుకుంటున్నారు. ఇటీవల మద్యం షాపుల ఏర్పాటులోనూ వాటాలకు ఒప్పందాలు చేసుకున్నారు. అధికారం చేజిక్కిన వెంటనే మొత్తం రేషన్ డీలర్లను పక్కన పెట్టేసి టీడీపీ నేతలకు కట్టబెట్టేశారు. ఇందు కోసం రూ.లక్షల్లో దండుకున్నారు. ఈ రేషన్ షాపులకు సరఫరా అయ్యే బియ్యం మొత్తం కూడా నల్లబజారుకు తరలించి అమ్ముకునేందుకు అవకాశం కల్పించారు. ఈ అక్రమ వ్యాపారంలో 30 శాతం వాటా తీసుకుంటూ అవినీతిలో రికార్డులు తిరగరాస్తున్నారు.

**షాపులన్నీ టీడీపీ నేతల చేతుల్లోనే..**

నియోజకవర్గంలో 174 రేషన్ షాపులు ఉన్నాయి. ఈ షాపులను అన్ని పార్టీల మద్దతుదారులు నిర్వహిస్తున్నారు. అయితే టీడీపీ అధికారంలోకి వచ్చాక నాలుగైదు షాపులు మినహా మిగతా రేషన్ దుకాణాలన్నింటినీ ఆ పార్టీ నేతల చేతుల్లోకి లాగేసుకున్నారు. ఈ షాపులను తమకు అనుకూలంగా ఉండే వారికి రూ.లక్షల్లో దండుకుని కట్టబెట్టేశారు. వీటికి మండల లెవల్ స్టాక్ (ఎంఎల్ఎస్) పాయింట్ నుంచి బియ్యాన్ని సరఫరా చేస్తారు. ఈ బియ్యంను అడ్డం పెట్టుకుని స్థానిక బడానేత భారీ అక్రమార్జనకు తెరలేపినట్లు సమాచారం. ఆయన కనుసన్నల్లో సంబంధిత పౌరసరఫరాల శాఖ అధికారి ఆధ్వర్యంలోనే ఈ వ్యాపారం నడుస్తున్నట్లు తెలుస్తోంది. ప్రజలకు సక్రమంగా రేషన్ అందేలా చూడాల్సిన సదరు అధికారి డీలర్లకు వ్యాపారంలో మెలకువలు చెబుతూ అక్రమ వ్యాపారానికి అండగా నిలుస్తున్నారు.



వలేటివారిపాలెంలో రేషన్ బియ్యం పంపిణీ



కందుకూరులోని మార్కెట్ యార్డులో ఉన్న ఎంఎల్ఎస్ పాయింట్

**అక్రమాలు ఇక్కడి నుంచే..**

నియోజకవర్గంలో ఉన్న 174 రేషన్ షాపులకు నెలకు 1,100 మెట్రిక్ టన్నుల బియ్యం ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి అందజేస్తారు. అందులో 300 మెట్రిక్ టన్నుల మాత్రమే పంపిణీ జరుగుతోంది. అందులో డీలర్లు పంపిణీ సమయంలోనే 100 మెట్రిక్ టన్నులు కార్డుదారుల నుంచి కొనేస్తున్నారు. మొత్తంగా 200 మెట్రిక్ టన్నులు మాత్రం కార్డుదారులకు వెళ్తుండగా మిగిలిన 900 మెట్రిక్ టన్నుల బియ్యం నల్లబజారుకు తరలివెళ్తున్నాయి. ఇందులో కృష్ణపట్నం పోర్టుకే 700 టన్నులు వెళ్తున్నట్లు సమాచారం. కార్డుదారులకు రేషన్ డీలర్లు పదో.. పరకో ఇచ్చి సరిపెడుతున్నారు. వీరు రేషన్ మాఫియా వ్యక్తులకు కేజీ రూ.20 నుంచి రూ.30కు విక్రయిస్తున్నారు. ఈ లెక్కన రేషన్ డీలర్లు నెలకు రూ.లక్ష నుంచి రూ.1.50 లక్షల వరకు సంపాదించుకుంటున్నారు. రేషన్ మాఫియాకు అండగా నిలుస్తున్న సదరు బడా నేతకు 30 శాతం కమీషన్‌తో పాటు ఇక సివిల్ సప్లయీస్, పోలీసులకు ముడుపులు ఇచ్చుకుంటూ నెలకు రూ.2 కోట్ల మేర మాఫియా దోపిడీ చేస్తోంది.

**రేషన్ షాపులు: 174**

| | |
|---|---|
| షాపులకు సరఫరా అయ్యే బియ్యం | 1100 మెట్రిక్ టన్నులు |
| కార్డుదారులకు సరఫరా జరిగేది | 300 మెట్రిక్ టన్నులు |
| సరఫరా సమయంలోనే కొనే బియ్యం | 100 మెట్రిక్ టన్నులు |
| మొత్తంగా పక్కదారి పట్టే బియ్యం | 900 మెట్రిక్ టన్నులు |

**తనిఖీల్లో బట్టబయలు**

సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ డైరెక్టర్ కందుకూరు ఎంఎల్ఎస్ పాయింట్‌ను గత నెల 29వ తేదీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ అక్రమాలు చూసి ఆయన నివ్వెరపోయారు. నియోజకవర్గంలో 174 రేషన్ షాపులు ఉంగా 160 షాపులకు రేషన్ బియ్యం పంపిణీ చేసినట్లు రికార్డులు ఉన్నాయి. వీటిల్లో 61 షాపుల డీలర్లు బయోమెట్రిక్ వేయకుండానే బియ్యం షాపులకు పంపించినట్లు గుర్తించారు. ఇక్కడ జరుగుతున్న అవినీతికి సివిల్ సప్లయీస్ అధికారులు బలై పోతారేమోనని స్థానిక అధికార పార్టీ నాయకులు వచ్చి ఆయనకు సర్ది చెప్పే ప్రయత్నం చేసినా తనిఖీలు ఆపలేదు. ఆయన ప్రశ్నలతో అధికారులకు చెమటలు పట్టాయి. సరఫరా చేసిన షాపుల లిస్టు తీసుకొని వలేటివారిపాలెం రేషన్ షాపునకు వెళ్లి స్టాక్ తనిఖీ చేయగా 76 బస్తాలు తేడా కనిపించింది. గత నెల 28వ తేదీన బస్తాల స్టాక్‌లో తేడాలు వచ్చాయి. అది కూడా నవంబర్‌లో పంపిణీ చేయాల్సిన స్టాక్. పంపిణీ మొదలు కానేలేదు. ఇలా స్టాక్‌లో తేడాలు రావడంతో డైరెక్టర్‌తో పాటు అధికారులు నివ్వెర పోయారు. ఒక షాపుల్లోనే ఇంత తేడా ఉంటే నియోజకవర్గంలోని 174 షాపులు చూస్తే ఎన్ని చిత్రాలు బయట పడతాయోనని ఆయన వ్యాఖ్యానించడం చర్చనీయాంశమైంది.

**పేదల కన్నీళ్లు**

కందుకూరు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో ఈ అక్రమ వ్యాపారంతో పేదలు కష్టాలు పడుతున్నారు. రెండో తేదీ నుండే వ్యాపారులు బియ్యం ఇవ్వండి అని డీలర్లపై ఒత్తిడి తెస్తున్నారు. ఉలవపాడు మండలంలో మండల టీడీపీ నేత తనయుడు అంతా నడిపిస్తున్నాడు. లింగసముద్రం, వలేటివారిపాలెం, గుడ్లూరు, కందుకూరులో టీడీపీ నాయకులు వ్యాపారం చేస్తున్నారు. వీరు కోట్లు గడిస్తుండగా పేదలకు మాత్రం ఆకలి కేకలు తప్పడం లేదు.



విన్నర్స్ తూర్పు గోదావరి జట్టు

# కబడ్డీ విజేత తూర్పుగోదావరి

కావలి: పట్టణంలోని డీబీఎస్ ఇంజినీరింగ్ కళాశాలలో మూడు రోజులుగా జరుగుతున్న అంతర్ జిల్లాల స్థాయి అండర్–19 కబడ్డీ పోటీలు శుక్రవారంతో ముగిశాయి. చివరి రోజు తూర్పుగోదావరి, శ్రీకాకుళం జట్ల మధ్యన ఉత్కంఠ భరితంగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో తూర్పుగోదావరి జట్టు క్రీడాకారులు సత్తా చాటి విజేతలుగా నిలిచారు. రెండో స్థానంలో శ్రీకాకుళం, మూడో స్థానంలో నెల్లూరు జట్లు నిలిచాయి. విజేత జట్లను డీబీఎస్ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ దామిశెట్టి శ్రీనివాసనాయుడు, కరస్పాండెంట్ దామిశెట్టి సుధీర్‌నాయుడు అభినందించారు.



రన్నర్స్ శ్రీకాకుళం జట్టు



తృతీయ స్థానం నెల్లూరు జట్టు

# మొదటి పంటకు సమృద్ధిగా..

- జిల్లాలో 7.77 లక్షల ఎకరాలకు సాగునీరు
- ఐఏబీ సమావేశంలో నిర్ణయం




జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నారాయణ

నెల్లూరు (దర్గామిట్ట): జిల్లాలో మొదటి పంట వరికి సంబంధించి 7.77 లక్షల ఎకరాలకు సాగు నీరు అందించడానికి ప్రణాళిక ప్రకటించారు. శుక్రవారం కలెక్టరేట్ ఆవరణలోని తిక్కన ప్రాంగణంలో ఐఏబీ చైర్మన్, కలెక్టర్ ఆనంద్ అధ్యక్షతన జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశం (ఐఏబీ) జరిగింది. జిల్లాలోని సోమశిల, కండలేరు జలాశయాల్లో నీరు పుష్కలంగా ఉన్న నేపథ్యంలో ఆయా ప్రాజెక్ట్‌ల పరిధిలోని కాలువ కింద జిల్లాలో ప్రధాన పంట అయిన వరి మొదటి పంటకు 7.77 లక్షల ఎకరాలకు సాగునీరు ఇచ్చేందుకు అవకాశం ఉందని ఇరిగేషన్ సోమశిల, తెలుగు గంగ ప్రాజెక్ట్ అధికారులు ప్రతిపాదనలు నివేదించారు. ఈ మేరకు మంత్రి నారాయణ నేతృత్వంలో కలెక్టర్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రైతు సంఘాల నేతలతో కలిసి నీటి విడుదల ప్రణాళికను ప్రకటించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, నెలవల విజయశ్రీ కురుగొండ్ల రామకృష్ణ, ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్‌చక్రవర్తి, జేసీ కార్తీక్, డీఆర్‌ఓ ఉదయ భాస్కర్, రైతు సంఘ నేత బెజవాడ గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- **సోమశిల ద్వారా 5.51 లక్షల ఎకరాలకు..**

జలాశయంలో గురువారం నాటికి 69.346 టీఎంసీల నీరు ఉంది. నవంబర్, డిసెంబర్ నెలల్లో జలాశయానికి మరో 11.17 టీఎంసీలు నీరు వచ్చే అవకాశం ఉంది. మొత్తం 80.463 టీఎంసీల నీటి లభ్యతను దృష్టిలో పెట్టుకుని 7.500 టీఎంసీలు డెడ్ స్టోరేజ్, 3 టీఎంసీ తాగునీటి అవసరాలకు, 1.5 టీఎంసీ ఆవిరి పోగా మిగిలి ఉండే 68.463 టీఎంసీల నీటి లభ్యతతో పాటు కనిగిరి రిజర్వాయర్, సర్వేపల్లి రిజర్వాయర్లలో లభ్యమయ్యే 3.17 టీఎంసీల నీటిని కలుపుకుని మొత్తం 71.633 టీఎంసీల నీటి లభ్యత ఉంటుందన్నారు.

- పెన్నార్ డెల్టా ద్వారా 2.47 లక్షల ఎకరాలకు, కనుపూరు కాలువ ద్వారా 66 వేల ఎకరాలకు, సోమశిల ప్రాజెక్ట్ ఉత్తర దక్షిణ కాలువల ద్వారా 2.38 లక్షల ఎకరాలకు మొత్తం 55.155 టీఎంసీ నీటిని కేటాయించనున్నారు. ఒక టీఎంసీతో పదివేల ఎకరాలకు చొప్పున 55.100 టీఎంసీల నీటితో సోమశిల ప్రాజెక్ట్ నుంచి మొత్తం 5.51 లక్షల ఎకరాలకు సాగు నీరు అందించేలా సమావేశంలో తీర్మానించారు. ఇక ఇదే జలాశయం నుంచి రాళ్లపాడు రిజర్వాయర్‌కు 1.5 టీఎంసీ నీటిని అందజేయనున్నారు.

- **కండలేరు కింద 2.26 లక్షల ఎకరాలకు**

కండలేరు జలాశయానికి సంబంధించి ప్రస్తుతం 49.386 టీఎంసీల నీరు నిల్వ ఉంది. నవంబర్, డిసెంబర్ నెలల్లో జలాశయానికి మరో 10.614 టీఎంసీల నీరు వచ్చే అవకాశం ఉందని, ఈ లెక్కన మొత్తం 51.600 టీఎంసీల నీరు అందుబాటులో ఉందని తెలుగుగంగ అధికారులు లెక్కలు తేల్చారు. ఇందులో 22.600 టీఎంసీల నీటిని నెల్లూరు, తిరుపతి జిల్లాల్లోని 2.26 లక్షల ఎకరాలకు అందించనున్నారు. కండలేరు అధికార ఆయకట్టు రైతులకు 2.150 టీఎంసీలు, 5 టీఎంసీలు చెన్నై తాగునీటి అవసరాలకు, 2 టీఎంసీలు రాపూరు, పొదలకూరు, వెంకటగిరి, సూళ్లూరుపేట, గూడూరు, శ్రీకాళహస్తి, తిరుపతి పట్టణాల తాగునీటి అవసరాలకు, 6 టీఎంసీలు ఆవిరి నష్టం, 2 టీఎంసీలు స్వర్ణముఖి బ్యారేజీ నీటి అవసరాలకు, 1.250 టీఎంసీలు పరిశ్రమలకు పోను జలాశయంలో 10.600 టీఎంసీల నీరు ఉంటుందని తెలుగుగంగ అధికారులు ప్రకటించారు. ఈ నీటిని 2025 సంవత్సరం వేసవి కాలంలో నెల్లూరు, తిరుపతి జిల్లాల తాగునీటి అవసరాలకు ఉపయోగించనున్నామన్నారు.

# కేశవా.. కబ్జాను ఆపవా

- ఆలయ స్థలంలో వ్యాపార సముదాయాల నిర్మాణం
- గతంలోనే ఆక్రమించి బేస్‌మట్టం వేసిన టీడీపీ నేతలు
- అప్పట్లో స్థానికులు అడ్డుకోవడంతో నిలిచిపోయిన నిర్మాణం
- తాజాగా అధికారంలోకి రావడంతో బరితెగింపు
- దేవదాయశాఖాధికారులకు తెలిసినా మౌనవత్రం

**దేవదాయశాఖ మంత్రి ఇలాకాలో టీడీపీ నేతలు బరితెగించారు. సాక్షాత్తు చెన్నకేశవస్వామి ఆలయ స్థలాన్ని దర్జాగా కబ్జా చేసి వ్యాపార సముదాయాలు నిర్మిస్తున్నారు. రూ.కోటి విలువైన స్థలాన్ని అప్పనంగా కాజేసినా.. దేవదాయశాఖ అధికారులు ధృతరాష్ట్రుడి పాత్ర పోషిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఆత్మకూరులో దాదాపు ఏడు దశాబ్దాలకు పైగా పేద ప్రజలు నివసిస్తున్న కొలగాని సత్రం భూములు దేవదాయశాఖకు చెందుతాయని, వారిని ఖాళీ చేయాలని నోటీసులు జారీ చేసిన అధికారులకు, సదరు మంత్రివర్యుడికి చేజర్లలో టీడీపీ నేతల భూకబ్జా కనబడడం లేదా? అని ప్రజలు నిలదీస్తున్నారు.**



చేజర్ల బస్‌షెల్టర్ వెనుక చెన్నకేశవస్వామి స్థలంలో నిర్మిస్తున్న గదులు

సాక్షి ఇన్వెస్టిగేషన్

సాక్షి, టాస్క్‌ఫోర్స్: చేజర్ల మండల కేంద్రంలో టీడీపీ నేతల బరితెగింపు పరాకాష్టకు చేరింది. అధికార మదం తలకెక్కించుకుని ఏమి చేసినా.. అడిగే వారెవరంటూ రెచ్చిపోతున్నారు. రూ.కోటి విలువైన చెన్నకేశస్వామి ఆలయ భూమిని కబ్జా చేసి.. వ్యాపార సముదాయాలు నిర్మిస్తున్నారు. రాష్ట్ర దేవదాయశాఖ మంత్రికి అత్యంత సన్నిహితులే ఈ దారుణానికి తెగించడం గమనార్హం. వివరాల్లోకి వెళ్తే.. చేజర్లలో కొన్ని దశాబ్దాల క్రితం అప్పటి పెద్దలు గ్రామకంఠం భూమిలో చెన్నకేశవ ఆలయాన్ని నిర్మించారు. 1928లో వాసిపల్లి వెంకట నరసారెడ్డి కుమారుడు సుబ్బారెడ్డికి చెందిన సర్వే నంబర్ 590.2లో 40 సెంట్ల భూమిని స్వామి వారి ధర్మసత్రం, దీపారాధనకు వినియోగించుకోవాలని వీలునామా రాశారు. అప్పట్లో స్వామి వారి ఉత్సవాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ పరిసర ప్రాంతాల్లో సర్వే నంబర్ 305/1–1లో సుమారు 100 అంకణాల స్థలాన్ని కూడా వీలునామా పూర్వకంగా ఇచ్చారు. ఈ భూమి చేజర్ల గ్రామ బస్‌షెల్టర్ వెనుక భాగంలో ఉంది. స్వామి వారు ఊరేగింపులో ఇక్కడ కొద్దిసేపు సేదతీరేవారని గ్రామస్తులు చెబుతున్నారు. అయితే మండలం కేంద్రంలో స్థలాల విలువ పెరగడంతో స్థానిక టీడీపీ నేతల కన్ను ఆ భూమిపై పడింది. టీడీపీ గతంలో అధికారంలో ఉండగానే ఈ స్థలాన్ని ఆక్రమించి వ్యాపార సముదాయాన్ని నిర్మించే ఏర్పాటు చేశారు. అయితే అప్పట్లో బేస్‌మట్టం నిర్మించే క్రమంలో కొంత మంది అడ్డు తగలడంతో పనులు అక్కడికక్కడే ఆగిపోయాయి. తాజాగా కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ నాయకులు రెచ్చిపోతున్నారు. ఈ క్రమంలో గతంలో ఆక్రమించి వదిలేసిన ఆ దేవుడి స్థలాన్ని కబ్జా చేసి శ్లాబ్ వరకు పూర్తి చేశారు. వీటిని తమ అనుచరులకే బాడుగలకు ఇచ్చేందుకేనని స్థానికంగా పలువురు చెబుతున్నారు. ఇంత జరుగుతున్నా దేవదాయశాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. దేవ దాయశాఖ మంత్రి ఉన్న నియోజకవర్గంలో ఈ విధంగా దేవాలయానికి చెందిన స్థలాన్ని కబ్జా చేయడం ఏమిటని భక్తులు ఆందోళన చెందుతున్నారు.

**పరిశీలించి చర్యలు తీసుకుంటాం**

చేజర్లలోని చెన్నకేశవస్వామి దేవాలయానికి సంబంధించిన స్థలంలో గదులు నిర్మించిన విషయాన్ని పరిశీలిస్తాం. ఆలయ స్థలంలో రూములు నిర్మించారని తేలితే.. నిర్మించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొంటాం. ఆ గదుల నిర్మాణాలకు అనుమతులు ఉన్నాయో లేదా అనే విషయాన్ని పరిశీలించాల్సి ఉంది.

– కోవూరు జనార్ధన్‌రెడ్డి, జిల్లా దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్

# ఆరోగ్య సంజీవనికి రోగమొచ్చింది

**అంపశయ్యపై '108'**
- వేతనాలివ్వని ప్రభుత్వం
- చేతులెత్తేసిన ప్రైవేట్ సంస్థ
- పండగ వేళా పస్తులతో కార్మికులు
- శిథిలావస్థకు చేరుతున్న వాహనాలు

రోడ్డు ప్రమాదాలు సంభవించినా.. ఆపత్కాల పరిస్థితులు ఏర్పడినా.. గర్భిణులకు పురిటి నొప్పులు ప్రారంభమైనా.. ఒక్క ఫోన్ చేస్తే తక్షణమే వాలిపోయి వారిని ఆస్పత్రులకు చేర్చి ప్రాణాలను కాపాడే ఆరోగ్య సంజీవని '108'కు రోగమొచ్చింది. ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం లేకపోవడంతో ఇది అంపశయ్యకు చేరింది. వేతనాలను సైతం ఇవ్వకపోవడంతో పండగ వేళా పస్తులతో కార్మికులు అలమటించాల్సిన పరిస్థితి నెలకొంది.



పెద్దాస్పత్రి ఆవరణలో నిలిచిపోయిన 108 వాహనాలు

**నెల్లూరు(అర్బన్):** కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక వైద్యసేవలు మెరుగైన మాట అటుంచితే ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉండే '108' అంబులెన్స్‌లు అంపశయ్యకు చేరాయి. వాహనాలను నడిపే పైలట్లు, రోగికి సపర్యలు చేస్తూ ప్రాథమిక వైద్యం అనంతరం ఆస్పత్రులకు తరలించే టెక్నీషియన్ల జీవితాలు జీతాల్లేక రోడ్డున పడ్డాయి. తమ బాధను పంటిబిగువున భరిస్తూ బతుకు బండిని వీరు లాగుతున్నారు.

**జీతాలెప్పుడొస్తాయో..?**

జిల్లాలో 108 వాహనాల్లో పనిచేస్తున్న పైలట్లు, ఈఎంటీలకు నేటికీ జీతాలను ప్రభుత్వం చెల్లించలేదు. ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలలు దాటి నాలుగో నెల వచ్చినా ఇదే పరిస్థితి. దసరా, దీపావళి పండగలప్పుడూ వీరు పస్తులతోనే కాలం గడిపారు.

**కక్ష సాధింపునకు పరాకాష్ట**

జిల్లాలో 108 సిబ్బంది స్కీమ్ వర్కర్లుగా పనిచేస్తున్నారు. వీరు అరబిందో సంస్థ తరపున ఉద్యోగాలు చేస్తున్నారు. వాస్తవానికి ప్రతి ఉద్యోగికి యాజమాన్య భాగస్వామ్య నిధి.. వారి జీతం నుంచే పీఎఫ్ జమవుతాయి. అరబిందో సంస్థపై కక్ష సాధింపు చర్యగా బడ్జెట్‌ను ప్రభుత్వం విడుదల చేయలేదు. జిల్లాలోని 37 మండలాలకు సంబంధించి 108 వాహనాలు 40 ఉన్నాయి. ఇందులో రెండు షిఫ్టులు, సెలవులు పెట్టినప్పుడు ఇబ్బంది లేకుండా మొత్తం 110 మంది పైలట్లు పనిచేయాలి. అయితే జీతాలు సక్రమంగా ఇవ్వకపోవడంతో 15 ఖాళీలు ఏర్పడ్డాయి. పైలట్లుగా చేరేందుకు ఎవరూ ముందుకురావడం లేదు. ఉన్న వారిలోనూ కొందరు మానేసే పరిస్థితి నెలకొంది. పర్యావసానంగా పండగల వేళ, అత్యవసర సమయాల్లోనూ సెలవులివ్వలేని పరిస్థితి ఏర్పడింది.

**కొత్త వాహనాలకు మంగళం**

గడిచిన ఐదేళ్లలో లక్షలాది కిలోమీటర్లు తిరిగిన 108 వాహనాలు నేడు పలు చోట్ల శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. వీటి స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేయాల్సి ఉన్నా, కూటమి ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోవడంలేదు. మరమ్మతులకు గురైన వాటికీ రిపేర్లు చేయించడం లేదు. దీంతో కొన్ని వాహనాలు మరమ్మతుల కోసం నిరీక్షిస్తున్నాయి.

**సిబ్బంది ఆందోళన బాట**

నాలుగు నెలలుగా జీతాలివ్వకపోవడంతో ఎలా బతకాలంటూ 108 పైలట్లు, ఈఎంటీలు జిల్లాలో ఆందోళన బాట పట్టారు. కలెక్టర్, జేసీ, డీఎంహెచ్ఓ, అరబిందో సంస్థ మేనేజర్ తదితరులకు పలు మార్లు అర్జీలిచ్చినా స్పందన లభించలేదు. నల్లబ్యాడ్జీలతో నిరసనలు చేస్తూ రోగులకు ఇబ్బంది కలగకుండా చూస్తున్నారు. మలి దశ చర్చలకు సిబ్బందిని యాజమాన్యం ఈ శుక్రవారం పిలిచింది. దీని బట్టి తమ ఆందోళనలను ఉధృతం చేస్తామని సిబ్బంది పేర్కొంటున్నారు.

**ఇవీ డిమాండ్లు..**

మూడు నెలల వేతనాన్ని తక్షణమే ఇవ్వడంతో పాటు ఏటా పది శాతం ఇంక్రిమెంట్‌ను అందజేయాలని సిబ్బంది డిమాండ్ చేస్తున్నారు. 108ను ప్రభుత్వమే నిర్వహించడంతో పాటు ఖాళీలను భర్తీ చేయాలంటున్నారు. ప్రతి వాహనం ఫిట్‌గా ఉండటంతో పాటు శిథిలావస్థకు చేరుకున్న వాహనాల స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

**గత ప్రభుత్వంలో అంతా సాఫీగా..**

2014లో ఏర్పడిన టీడీపీ ప్రభుత్వంలో జిల్లాలో 22 వాహనాలే ఉండేవి. 2019 ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయం సాధించి సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టాక వైద్యసేవలను మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో ప్రతి మండలానికో 108 వాహనాన్ని ఏర్పాటు చేశారు. ప్రతి మండలానికీ కొత్త వాహనాన్ని సమకూర్చి సేవల్లో ఎలాంటి ఆటంకం కలగకుండా చర్యలు చేపట్టారు.

**జీతాలివ్వకపోతే ఆందోళన**



రాజకీయ కక్షతో 108 సిబ్బందిని కూటమి ప్రభుత్వం రోడ్డుపై పడేసింది. జీతాల కోసం బడ్జెట్‌ను తక్షణమే విడుదల చేయాలి. సిబ్బంది పీఎఫ్‌ను సక్రమంగా చెల్లించని అరబిందో సంస్థపై అధికారులు చర్యలు చేపట్టాలి. డిమాండ్ల సాధన కోసం ఆందోళన చేపట్టాం. ప్రభుత్వం స్పందించకపోతే అన్ని సంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమిస్తాం.

– సతీష్‌కుమార్, 108 ఉద్యోగుల సంఘ గౌరవాధ్యక్షుడు

## ఎస్జీటీల సర్టిఫికెట్ల పరిశీలన



**నెల్లూరు (టౌన్):** ఉమ్మడి జిల్లాలోని మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతులను కల్పించేందుకు గానూ సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ను జిల్లా విద్యాశాఖ అధికారులు శుక్రవారం నిర్వహించారు. సీనియార్టీ జాబితాలో ఉన్న ఉపాధ్యాయుల సర్టిఫికెట్లను దర్గామిట్టలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో పరిశీలించారు. నెల్లూరు కార్పొరేషన్‌తో పాటు కావలి, గూడూరు మున్సిపాలిటీల్లో సుమారు 18 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఒక్కో పోస్టుకు ముగ్గురు చొప్పున పిలిచారు. 36 మంది హాజరుకాగా, మిగిలిన వారిని శనివారం పిలవనున్నారు. మోడల్ స్కూల్స్ సూపరింటెండెంట్ సురేష్, కోడూరుపాడు జెడ్పీహెచ్ఎస్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ స్తంభం పడి వృద్ధుడి మరణం

**ఆత్మకూరు:** మండలంలోని వాశిలి సమీపంలో కాలువ పూడికతీత పనులను చేస్తున్న హిటాచీ తగలడంతో విద్యుత్ స్తంభం పడి సమీపంలో ఉన్న రైతు మృతి చెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై జిలానీ వివరాల మేరకు.. కొండమీదకొండూరు, వాశిలి గ్రామాల రైతులు తమ పొలాలకు సాగునీటి కోసం కాలువ పూడికతీత పనులు చేయిస్తున్నారు. హిటాచీతో సాగుతున్న ఈ పనులను వారు పర్యవేక్షించసాగారు. ఈ నేపథ్యంలో పనులు చేస్తున్న యంత్రం తగలడంతో విద్యుత్ స్తంభం పడి కొండమీదకొండూరుకు చెందిన రైతు దశరథరామిరెడ్డి (75 తీవ్రంగా గాయపడ్డారు. ఆత్మకూరు ఆస్పత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యలో మృతి చెందారు. ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## క్లుప్తంగా

### వీఎస్‌యూలో 11న జాబ్ మేళా

**వెంకటాచలం:** కాకుటూరు సమీపంలోని విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ)లో జాబ్‌మేళాను ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, జిల్లా ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయం, సీడాప్ ఆధ్వర్యంలో ఈ నెల 11న నిర్వహించనున్నామని ఇన్‌చార్జి వీసీ విజయభాస్కర్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలను నిర్వహించనున్నారని, 18 నుంచి 35 ఏళ్లలోపు ఉండి ఇంటర్ నుంచి పీజీ చదివిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 79896 13024, 95734 82179 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

### 123 మంది విద్యార్థుల గైర్హాజరు

**వెంకటాచలం:** వీఎస్‌యూ పరిధిలోని అనుబంధ కళాశాలల్లో శుక్రవారం నిర్వహించిన మూడో సెమిస్టర్ పరీక్షలకు 123 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని వర్సిటీ పరీక్షల నిర్వహణాధికారి డాక్టర్ మధుమతి తెలిపారు. 1385 మంది విద్యార్థులకు గానూ 1262 మంది హాజరయ్యారని చెప్పారు.

### ట్రాక్టర్‌ను ఢీకొని వాహనచోదకుడి మృతి



**సోమశిల:** ఇసుక ట్రాక్టర్‌ను ఢీకొనడంతో వాహనచోదకుడు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని యాకర్లపాడు వద్ద ఎన్‌హెచ్ – 65పై శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. పడమటికంభంపాడు రీచ్ నుంచి బద్వేల్ వైపు ఇసుక ట్రాక్టర్ బయల్దేరింది. ఈ క్రమంలో ట్రాక్టర్‌ను ఢీకొని బద్వేల్‌లోని సుమిత్రానగర్‌కు చెందిన వెంకటేశ్వర్లు (40) అక్కడికక్కడే మరణించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు పోలీసులు తరలించారు. మృతుడి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు.

### రైలు ఢీకొని వ్యక్తి దుర్మరణం



**నెల్లూరు సిటీ:** రైలు ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందిన ఘటన నగరంలోని ఆత్మకూరు బస్టాండ్ బ్రిడ్జి వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల వివరాల మేరకు.. నగరంలోని ఆత్మకూరు బస్టాండ్ బ్రిడ్జిపై గుర్తుతెలియని వ్యక్తిని రైలు ఢీకొంది. దీంతో గాయపడి మృతి చెందారు. ఎరుపు రంగుపై నలుపు రంగు చెక్స్ కలిగిన హాఫ్ హ్యాండ్స్ షర్ట్, గ్రే కలర్ ప్యాంట్‌ను ధరించి ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### యువకుడిపై పోక్సో కేసు

**సంగం:** ప్రేమ పేరుతో బాలికపై లైంగిక దాడికి పాల్పడిన సంగానికి చెందిన సోమా వంశీపై పోక్సో కేసును నమోదు చేశామని ఎస్సై రాజేష్ తెలిపారు. వివరాలు.. స్థానిక బస్టాండ్ సెంటర్‌లో దుస్తుల షాపును ఈయన నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ప్రేమ పేరుతో అదే ప్రాంతంలో ఉంటున్న ఓ బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డారు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు నిందితుడ్ని పోలీసులు అదుపులోకి తీసుకొని పోక్సో కేసును నమోదు చేసి అరెస్టు చేశారు. డీఎస్పీ విచారణ జరుపుతున్నారు.

### జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌కు అనంతసాగరం విద్యార్థి



**సోమశిల:** ఏలూరు జిల్లాలో నిర్వహించిన 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ – 14 అథ్లెటిక్స్ పోటీల్లో 80 మీటర్ల హర్డిల్స్ విభాగంలో అనంతసాగరం జెడ్పీ హైస్కూల్ తొమ్మిదో తరగతి విద్యార్థి మాహిన్ అత్యుత్తమ ప్రతిభ చూపారు. రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జార్ఖండ్‌లో డిసెంబర్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి అథెటిక్స్ పోటీల్లో ఈమె పాల్గొననుంది. విద్యార్థిని హెచ్‌ఎం లక్ష్మీప్రసన్న తదితరులు అభినందించారు.

### నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్) : 119
లేయర్ (లైవ్) : 110
బ్రాయిలర్ చికెన్ : 220
బ్రాయిలర్ స్కిన్‌లెస్ : 244
లేయర్ చికెన్ : 187

### పొదలకూరు నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి : రూ.50
సన్నవి : రూ.35
పండ్లు : రూ.20

## చైన్ స్నాచింగ్ కేసులో నిందితుల అరెస్ట్


నిందితులు, స్వాధీనం చేసుకున్న సరుడుతో పోలీసులు

**కావలి:** చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన ఇద్దరు నిందితులను శుక్రవారం అరెస్ట్ చేశామని కావలి రెండో పట్టణ సీఐ గిరిబాబు తెలిపారు. ఆయన వివరాల మేరకు.. వైకుంఠపురం శివార్లలోని అటవీ ప్రాంతంలో గేదెలను మేపుకొనేందుకు గానూ పట్టణంలోని చేవూరువారి తోటకు చెందిన గొట్టిపాటి హైమావతి ఈ ఏడాది జనవరి 12న వెళ్లారు. తిరిగొస్తున్న క్రమంలో ఆమె మెడలోని మూడు సవర్ల సరుడును గుర్తుతెలియని వ్యక్తులు లాక్కెళ్లారు. ఘటనపై పోలీసులకు ఆమె అప్పట్లోనే ఫిర్యాదు చేశారు. ఈ తరుణంలో దర్గా వీధికి చెందిన సల్మాన్, పెంకుల ఫ్యాక్టరీ రోడ్డుకు చెందిన వేణును నిందితులుగా గుర్తించి ఎస్సై గోపీచంద్ అదుపులోకి తీసుకున్నారు. తమదైన శైలిలో విచారించగా, నేరాన్ని వీరు అంగీకరించారు. సాయి అనే వ్యక్తి సైతం ఇందులో ఉన్నారని నిందితులు తెలిపారు. వీరి నుంచి మూడు సవర్ల సరుడును స్వాధీనం చేసుకున్నారు.

## వీఓఏల ధర్నా

**గుడ్లూరు:** స్థానిక వెలుగు కార్యాలయంలో మండలానికి చెందిన పలువురు వీఓఏలు ఆందోళనను శుక్రవారం చేపట్టారు. మండలంలోని 34 మంది వీఓఏలను రెండు నెలలు క్రితం అక్రమంగా తొలగించారని, వీరిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. వాస్తవానికి తమకు న్యాయం చేయాలంటూ కొందరు వీఓఏలు హైకోర్టును ఆశ్రయించారు. తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలని కోర్టు తీర్పునిచ్చింది. ఈ కాపీని కందుకూరు సబ్ కలెక్టర్ శ్రీపూజకు వీఓఏలు అందజేశారు. ఉత్తర్వులను పరిశీలించిన సబ్ కలెక్టర్ వెలుగు కార్యాలయాధికారులతో ఫోన్లో మాట్లాడి వీరిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని గురువారం ఆదేశించారు. అనంతరం 11 మంది వీఓఏలు వెలుగు కార్యాలయానికి చేరుకొని ఏపీఎం చినబాబుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఏపీఎం సరైన సమాధానం చెప్పకపోవడంతో కార్యాలయంలోనే బైఠాయించి ఆందోళన చేపట్టారు. స్థానిక నేతలతో కుమ్మక్కైన అధికారులు గుట్టుచప్పుడు కాకుండా వారికి అనుకూలంగా ఉన్న కొత్త వారిని అనధికారికంగా నియమించుకున్నారని ఆరోపించారు. ఆందోళన జరుగుతుండగానే అధికారులు జారుకున్నారు.

WANTED
• నెల్లూరు • గూడూరు • నాయుడుపేట
• సూళ్ళూరుపేట • శ్రీకాళహస్తి
• వెంకటగిరి • రేణిగుంట • కావలి
• కందుకూరు • ఒంగోలు • పొదలకూరు
• ఆత్మకూరులలో అనుభవం కలిగిన
కావలెను.
Languages known Telugu, Tamil
Qualification : Any Degree (Experienced or Freshers)
91500 11538, 0861-2331098
Mail : vharishman@gmail.com

## వ్యవసాయాభివృద్ధికి కృషి చేయాలి

• కలెక్టర్ ఆనంద్


మాట్లాడుతున్న ఆనంద్

**నెల్లూరు(దర్గామిట్ట):** వ్యవసాయరంగ అభివృద్ధికి కృషి చేయాలని కలెక్టర్ ఆనంద్ కోరారు. ఎమ్మెస్సెమ్ఈ క్లస్టర్ అవుట్‌రీచ్ ప్రోగ్రామ్‌ను స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (సిడ్బీ) ఆధ్వర్యంలో నగరంలోని ఓ హోటల్లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలో ఏర్పాటు చేసిన మూడు క్లస్టర్ల పురోగతి ఆశాజనకంగా లేదని, వీటి ఉత్పత్తిని పెంచేలా తోడ్పడాలని కోరారు. జిల్లాలో బత్తాయి, మామిడి తదితర పంటలను పెద్ద ఎత్తున సాగు చేస్తున్నారని, విదేశాలకు ఎగుమతి చేసేలా చూడాలని చెప్పారు. బత్తాయి, మామిడి ప్రాసెసింగ్ యూనిట్లను స్థాపించే ఔత్సాహిక వ్యాపారవేత్తలకు సాంకేతిక సహకారం అందించాలని సూచించారు. మహిళా సంఘాలు తయారు చేస్తున్న పలు రకాల ఉత్పత్తులను ఈ కామర్స్ ద్వారా ఆన్‌లైన్లో విక్రయించేలా ప్రోత్సహించాలన్నారు. అనంతరం సిడ్బీ హైదరాబాద్ రీజియన్ జనరల్ మేనేజర్ వేమూరి చంద్రమౌళి మాట్లాడారు. ఇతర దేశాలకు తమ ఉత్పత్తులను ఎగుమతి చేసే చిన్న స్థాయి యూనిట్లకు సాయం చేస్తామని వివరించారు. సిడ్బీ ప్రతినిధి సురేష్, డీఐసీఏడీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో కార్తీక లక్ష దీపోత్సవం


దీపాలను వెలిగిస్తున్న భక్తులు


ప్రవచిస్తున్న చాగంటి కోటేశ్వరరావు

**నెల్లూరు(బృందావనం):** కార్తీక మాసాన్ని పురస్కరించుకొని నగరంలోని వీఆర్సీ మైదానంలో కార్తీక మాస లక్ష దీపోత్సవాన్ని వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో శుక్రవారం ప్రారంభించారు. తొలుత గణపతి, గో పూజలను ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు చేపట్టారు. స్ఫటిక లింగానికి మహన్యాసపూర్వక శతరుద్రాభిషేకాన్ని నిర్వహించారు. తాత్కాలికంగా ఏర్పాటు చేసిన త్రయంబకేశ్వర్ జ్యోతిర్లింగం, అయోధ్య రామమందిర నమూనా ఆలయాలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశామని చెప్పారు. శివకేశవులను స్మరిస్తూ దీపాలను భక్తులు వెలిగించి హరిహరాదులకు ప్రీతిపాత్రులు కావాలన్నారు. 20 అడుగుల ఎత్తున్న పరమేశ్వర రూపాన్ని నయనానందకరంగా తీర్చిదిద్దారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విశాఖపట్నంలోని సౌభాగ్య భువనేశ్వరి పీఠాధిపతి రామానందభారతి హాజరయ్యారు. కార్తీకమాస లక్ష దీపోత్సవ కమిటీ నిర్వాహకులు కంజర్ల భాస్కర్‌శర్మ, ఆమంచర్ల వెంకటప్రభాకర్‌రావు, ఆశం విజయసారథి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**పవిత్రం.. కార్తీక మాసం**

కార్తీక మాసం దేవతలకు సంబంధించిందే కాదని.. మానవ సంబంధ బాంధవ్యాల విశిష్టతను చాటి చెప్పే మాసమని ప్రవచన కర్త చాగంటి కోటేశ్వరరావు అభివర్ణించారు. కార్తీక మాసంలోని తిథులు.. వాటి విశిష్టతను మానవ బంధాలతో వివరించారు. శివకేశవులకు కార్తీక మాసంలో ప్రతి రోజూ పవిత్రమైందన్నారు. సకలజీవుల్లో మనుష్య ప్రాణి గొప్పదైతే.. మనుషులు పూజించే గోవు అతిపవిత్రమైందని చెప్పారు. దీపం వెలిగించే గృహంలో లక్ష్మీదేవి స్థిరంగా ఉంటుందని తెలిపారు.

## బెల్టు దుకాణంపై పోలీసుల దాడి

**కొడవలూరు:** మండలంలోని రాచర్లపాడులో బెల్టు దుకాణంపై ఎస్సై కోటిరెడ్డి.. సిబ్బందితో కలిసి శుక్రవారం రాత్రి దాడి చేశారు. 35 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకోవడంతో పాటు నిర్వాహకుడ్ని అదుపులోకి తీసుకున్నారు. మండలంలో ఎవరైనా బెల్టు దుకాణాన్ని నిర్వహిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

## 1750 కిలోల బియ్యం స్వాధీనం

**నెల్లూరు సిటీ:** పీడీఎస్ బియ్యాన్ని వ్యాన్లో అక్రమంగా తరలిస్తుండగా, సివిల్ సప్లయ్స్ డిప్యూటీ తహసీల్దార్ తన సిబ్బందితో కలిసి శుక్రవారం దాడులు చేశారు. బుజబుజ నెల్లూరుకు చెందిన కసుమర్లపూడి శ్రీనివాసులు, ఎండీయూ ఆపరేటర్ మహబూబ్ జానీ కుమ్మక్కై రేషన్ బియ్యాన్ని విక్రయిస్తున్నారు. దాడుల్లో రూ.79,625 విలువజేసే 1750 కిలోలు రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. తగు చర్యల నిమిత్తం వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

**REAL ESTATE**

**FLAT FOR SALE**
■ RTC బస్టాండ్ దగ్గర, అరవిందనగర్, స్ప్రింగ్ నెస్ట్ అపార్ట్‌మెంట్‌లో 1650 చ॥అ॥ల, లాస్ట్ ఒక 3 BHK FLAT అమ్మకానికి కలదు.ఫోన్ : 96770 10777 [V-2715]

**HOUSE FOR SALE**
■గొలగమూడి దగ్గర 25అంకణాల స్థలంలో 2BHK మరియు 3BHK ఇల్లు కట్టించి ఇవ్వబడును. సంప్రదించండి : 9949921853, 6303724464. [NA-23856]

**PLOT FOR SALE**
■ నిప్పో ఫ్యాక్టరీ మెయిన్ గేట్ ఎదురుగా చంద్రమౌళి నగర్ 2వ వీధిలో21 అంకణముల స్థలములో ఉన్న రేకుల ఇల్లుతో సహా అమ్మకానికి కలదు. ఫోన్ : 96770 10777 [V-2716]

■కాకుపల్లి నుండి 2కి.మీ దూరంలో 1ఎకర పొలం, చిల్డ్రన్స్‌పార్క్ జగదీష్‌నగర్ ఎక్స్‌టెన్షన్‌లో 44అం॥ ప్లాటు, మైపాడుగేట్ సెంటర్ 18అం॥ స్థలం అమ్మబడును. సంప్ర : 83093 04379. [NA-23855]

■గూడూరు To వెంకటగిరి రోడ్డులో గూడూరుకి 7కి.మీ దూరంలో మెయిన్‌రోడ్డు ఆనుకొని TNR మ్యాంగో గార్డెన్ ఫామ్‌ల్యాండ్ తిప్పవరప్పాడు అం॥60ప్లాట్లుఅం॥15లక్షలు. అం॥రేటు25000మాత్రమే. KVR. 9573475039. [N-1256674]

**TO-LET**
■Available 3BHK Flat in 1 floor for Rent at Ramalingapuram, Nellore. Contact: 9848251945, 9391663316. [NA-11162]

■కమర్షియల్ స్పేస్:విజయకేర్ హాస్పిటల్, విజయమహల్ గేట్ సెంటర్, నెల్లూరు నందు2nd ఫ్లోర్ నందు బ్యాంకులు, ఆఫీసులు, డాక్టర్లకు బాడుగకు ఇవ్వబడును. 99485 45299, 99894 33567. [NA-6669]

■నెల్లూరు సుబేదారుపేట, మెయిన్‌రోడ్, మధుర స్వీట్స్ ప్రక్కన గ్రౌండ్ ఫ్లోర్ మరియు 1వ ఫ్లోర్ మొత్తం 2350Sft బ్యాంకులకు, షోరూంలకు మరియు ఆఫీసులకు, పార్కింగ్ సౌకర్యంతో బాడుగకు ఇవ్వబడును. వివరములకు సంప్రదించండి: Land Lord - 8500094888. [N-1253781]

**SERVICES**

**BUSINESS OFFER**
■Sell Tickets for Online Games and earn daily profits with low investment. Visit www.bingoticket.co and get 25 free tickets. Call: 8977176261, 8885642222. [WB-29934]

**GOLD FINANCE**
■బ్యాంకులలో వివిధ తాకట్టు సంస్థలలో ఉన్నవి బంగారు వేలం సమయానికి విడిపించి మార్కెట్ ధర ప్రకారం స్పాట్ క్యాష్ ఇవ్వబడును. సెల్: 98851 82772, 62813 46878. [N-1256664]

**WANTED**
■Wanted Teachers to Teach Hindi & Maths Subjects 1 to 7 classes attractive Salary. Contact number : 8499816075, 6281868532. [NA-11163]

■Wanted Hostel Warden & Tutors Salary : 12000 + Food Accommodation. Contact No : 9652424543, 63034 39646. [NA-23854]

■Mi Broadband Wanted Cable, Fiber Technicians, Electricians, Comp Hardware, Helpers, Salary : 12000-17000. Contact: 86866 11666, 92999 99498. [NA-23853]

■Wanted Teachers to Teach I to VI th Classes all subjects with english fluency & also Female Office Staff for reputed school at Haranadhapuram. NLR. 89855 83305. [NA-2743]

■Required Staff in Lotus Granites & Marbles, Near Narayana School, Mini by pass, Nellore. Sales Man, Sales Girls, Jr Accountant, Sr.Accountant with Tally Exp. Contact: 79956 55580, 91006 00992. [N-3931]

■నెల్లూరులోని ప్రముఖ ఇంటీరియర్ డిజైన్‌స్టోర్ నందు పని చేయుటకు Tally లో అనుభవం గల లేడీ అకౌంటెంట్ కావలెను. ఆకర్షణీయమైన జీతం. సంప్ర: 88868 62020. [NA-783]

■రాముస్ సూపర్ మార్కెట్, గాంధీనగర్, నెల్లూరు నందు పనిచేయుటకు మార్కెటింగ్ చేస్తూ డెలివరి ఇవ్వగల, స్కూటర్ డ్రైవింగ్ తెలిసిన డెలివరీ బాయ్స్/ గర్ల్స్ కావలెను. 98499 97918. [NA-783]

■లేడీ అకౌంటెంట్ : కంప్యూటర్ నాలెడ్జ్. Tally లో అనుభవం కల లేడీ అకౌంటెంట్ నెల్లూరులో మా ఆఫీసులో పని చేసేందుకు కావలెను. సెల్ : 80086 56666, 96184 84824. [NA-2741]

■ప్రముఖ సెక్యూరిటీ సంస్థకు నెల్లూరు టౌన్ VRC Ground నందు పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను.12hrs₹500/-.భోజనం ఉచితం. సంప్రదించండి: 9908954793, 9110339912. [NA-6678]

■శ్రీ వెంకటేశ్వరా ఫైనాన్స్ నందు పని చేయుటకు కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్ నెల్లూరు,గూడూరు, అల్లూరు, సూళ్లూరుపేట, నరుకూరు నందు కావలెను. సంప్రదించండి : 9700110061, 7386640043. [NA-11165]

■నెల్లూరులో FMCG కంపెనీలో పని చేయుటకు సేల్స్‌మెన్స్, ఆఫీస్‌బాయ్ కావలెను. అనుభవం ఉంటే ప్రాధాన్యత.Interview:సోమవారం 10.30 AM - 12.30PM. 63002 33491, 81426 84284. [NA-23840]

■విజయకేర్‌హాస్పిటల్, విజయమహల్ గేట్ దగ్గర, నెల్లూరు నందు పనికి నర్సులు (అనుభవం గల ANM, GNM, BSc, Nurses & Trained Nurse) కావలెను. సెల్: 99485 45299, 99894 33567. [NA-6674]

**CHANGE OF NAME**
I, PANYAM RAMYA (Old Name), Resident of D.No.27-107/2, Near Ramalayam, Balaji Nagar, Stonehousepet, Nellore, SPSR Nellore Dt, AP. Here by declare that I have changed my name as PANYAM RAMYA REDDY (New Name) W/o. MUDAMALA CHAITANYA KUMAR

■Kotak Life నందు Advisors కావలెను. Age : 25yrs ఆపైన, Qlf: Any Degree. గృహిణులకు మరియు రిటైరైన వారికి ప్రాధాన్యత. Salary: 10,000/-. Contact: 94903 28129. [NA-23804]

■నెల్లూరు బోసుబొమ్మ దగ్గర గల RKT పెట్రోల్ బంకులో పని చేయుటకు డే డ్యూటీకి యువతి, యువకులు & 24గం॥ల డ్యూటీ చేయుటకు యువకులు కావలెను. జీ: 15,000/-. 95501 89885. [NA-6677]

■నెల్లూరు, హరనాథపురం మెయిన్ రోడ్డులో AMR పెట్రోల్ బంకు నందు డే & నైట్ షిఫ్ట్‌లో పని చేయుటకు యువకులు కావలెను. జీ: 13,000/-. సంప్రదించండి: 89852 64143, 94947 97343. [NA-6676]

■ నెల్లూరు లోని ప్రముఖ బ్యాంక్ నందు పనిచేయుటకు సెక్యూరిటీగార్డ్స్ కావలెను. Q:10th పాస్, డ్యూటీ: 8 గం. PF, ESI సదుపాయం కలదు. వయస్సు 45 సం॥ లోపు. సెల్: 9848524081. [A-1399]

■ కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15 వేలు - 40వేలు,ఫ్రీ రూం+భోజనం.HYD.7995365999 [HA-98930]

■ శివకార్తికేయ హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి ఫుడ్ జీ18k Ph: 9912011899, 9912011499 [SCA-24000548]

**గమనిక**
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
ప్రతి రోజు క్లాసిఫైడ్స్ సాయంత్రం 3 గంటల వరకు మాత్రమే తీసుకోనబడును.
ఆ పైన పంపిన ప్రకటనలు ప్రచురించబడవు.